

ఎంవీపీ కాలనీలో రోడ్డు, ఫుట్‌పాత్‌ను తవ్వేయడంతో అధ్వానంగా మారిన పరిసరాలు

అడుగడుగునా అధ్వానం..!

ఎంవీపీ కాలనీలో సమస్యల తిష్ట

- విచ్చలవిడిగా రోడ్లు, ఫుట్‌పాత్‌ల తవ్వకాలు
- రహదారులపై యథేచ్ఛగా డెబ్రిస్ డంపింగ్
- బస్టాప్, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు
- చోద్యం చూస్తున్న జోన్–3 అధికారులు

జీవీఎంసీ జోన్–3 టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల నిర్లక్ష్యం కారణంగా ఎంవీపీ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. విచ్చలవిడిగా రోడ్లు, ఫుట్‌పాత్‌ల తవ్వకాలు, అనధికారిక నో పార్కింగ్ బోర్డుల ఏర్పాటు, బస్టాప్‌లను సొంత వ్యాపారాలకు వాడుకోవడం, అనేక చోట్ల యథేచ్ఛగా భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్ ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వాటిని నిత్యం పర్యవేక్షించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా పరిస్థితులను చక్కదిద్దాల్సిన జీవీఎంసీ అధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తుండటంతో అధ్వాన పరిస్థితులు ఎంవీపీ కాలనీలో రోజురోజుకూ అధికమవుతున్నాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంవీపీ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– ఎంవీపీకాలనీ

అపార్ట్‌మెంట్ల వద్ద నో పార్కింగ్ బోర్డులు



లాసన్స్ బే కాలనీలో అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన నో పార్కింగ్ బోర్డు

ఎంవీపీలో కొన్ని చోట్ల అపార్ట్‌మెంట్ల వద్ద గల జీవీఎంసీ రహదారులపై వాటి యజమానులు నో పార్కింగ్ బోర్డులు పెట్టడమేంటని పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సెక్టార్–12 లాసన్స్ బే కాలనీ సచివాలయం దరి జీవీఎంసీ రోడ్డుపై ఓ అపార్ట్‌మెంట్ యజమాని నో పార్కింగ్ బోర్డు పెట్టడం చర్చనీయాంశమైంది. ఇలాంటివి గుర్తించి తొలగించాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటం వల్లే ఎంవీపీ కాలనీలో ఈ సంస్కృతి విస్తరిస్తున్నట్లు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌గా బస్టాప్



అప్పుఘర్ రోడ్డులోని బస్టాప్‌లో నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

ఎంవీపీ కాలనీలో ఫుట్‌పాత్‌లే కాదు బస్టాప్‌లూ ఆక్రమణకు గురవుతున్నాయి. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్, టీటీడీ కూడలిలో పెద్ద ఎత్తున ఆక్రమణల కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వీటిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా.. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పుఘర్ రోడ్డులో ఓ కార్ వాష్ సెంటర్ వ్యాపారి ఏకంగా బస్టాప్‌ను ఆక్రమించి మరీ ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారం చేస్తున్నాడు. బస్టాప్‌లోని ప్రయాణికుల బెంచీలను సైతం తన వ్యాపారానికి వినియోగించుకోవడంతో అటుగా వెళ్లే వారు ముక్కున వేలేసుకుంటున్నారు.

గుంతలు పూడ్చే నాథులు కరువు



ఎంవీపీ డబుల్ రోడ్డులో కాపర్ వైర్ల కోసం తవ్విన గొయ్యి

ఎంవీపీ కాలనీలో మార్చిలో కాపర్ దొంగలు కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. సుందరంగా ఉన్న ఎంవీపీ డబుల్ రోడ్, ఉషోదయ కూడలికి వెళ్లే రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఎడాపెడా తవ్వేసి మరీ పక్కా సమాచారంతో కేజీల కొద్దీ విలువైన కాపర్ వైర్లను దోచేశారు. అక్రమ తవ్వకాలను నిత్యం పర్యవేక్షించాల్సిన జీవీఎంసీ జోన్–3 టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తింది. గప్‌చుప్‌గా రాత్రి పూట జరిగిన ఈ ఘరానా దొంగతనం.. బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ ల్యాండ్‌లైన్ సేవలకు కలిగిన విఘాతం కారణంగా బయటకొచ్చిన సంగతి తెలిసిందే. కాపర్ వైర్ల చోరీపై బీఎస్‌ఎన్‌ఎల్ ఉన్నతాధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ క్రైం పోలీసులు దర్యాప్తు జరిపి 8 మంది దొంగలను అరెస్ట్ చేసి జైలుకు సైతం పంపించారు. ఈ ఘటన జరిగి రెండు నెలలవుతున్నా.. కాపర్ వైర్ల కోసం తవ్విన గుంతలను పూడ్చే నాథులే కరువయ్యారు. నేటికీ ఆ గోతులు ప్రమాదకరంగా, అపరిశుభ్రంగా దర్శనమిస్తుండటంతో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై వాహన చోదకులు, పాదచారులు మండిపడుతున్నారు.

ఎక్కడ చూసినా నిర్మాణ వ్యర్థాలే..

ఎంవీపీ సెక్టార్–12 లాసన్స్ బే కాలనీలో ఎక్కడ చూసినా భవన నిర్మాణ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ఇళ్ల నిర్మాణ సమయంలో వచ్చే డ్రెబిస్‌ను స్థానికులు రోడ్ల పక్కనే వేసి వదిలేస్తున్నారు. వాటిని తొలగించే పరిస్థితి లేక గుట్టలుగా ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలిగించడంతోపాటు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన జోన్–3 శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. 19వ వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు డెబ్రిస్ డంపింగ్‌పై పలుమార్లు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎంవీపీ సెక్టార్–12లో రోడ్డు పక్కన పారబోసిన డెబ్రిస్



లాసన్స్ బే కాలనీలో రోడ్డు పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విశాలాక్షినగర్ 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతి నగర్, సంజీవినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

డీఎస్సీలో గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ నియామకాల(డీఎస్సీ) ప్రకటన ద్వారా గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం నాయకులు గురువారం రంపచోడవరం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన యువతకు ప్రయోజనం చేకూర్చే జీవో నంబర్ 3ని పునరుద్ధరించకుండా, ప్రత్యామ్నాయ ఉత్తర్వులు కూడా జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని వారు తెలిపారు. దీనివల్ల అత్యంత వెనుకబడిన గిరిజన తెగల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం చర్చించి కొత్త ఉత్తర్వులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీలో గిరిజన అభ్యర్థులకు నూరు శాతం రిజర్వేషన్‌ను తిరిగి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘ అధ్యక్షుడు సోనాయి అప్పలరాజు, కార్యదర్శి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కు అభివృద్ధికి చర్యలు



జూ ఎన్‌క్లోజర్‌లో వన్యప్రాణులను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కును శుక్రవారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సందర్శించారు. కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్) మహ్మద్ దివాన్ మైదీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అధికారులతో కలిసి ఎన్‌క్లోజర్లు, వాటిలో వన్యప్రాణులను ఆయన పరిశీలించారు. జూలో ఎన్ని రకాల జంతువులు, పక్షులున్నాయి, వాటికి అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, సంరక్షణ తదితర వాటి గురించి క్యూరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. జూలో యానిమల్ కీపర్లు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులతో ఎంపీ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జూ అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జూ పార్కును 6 నుంచి 7 ఏళ్లలో ప్రపంచ స్థాయి పార్కుగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. జూ అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి గోపాల నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్.. చెత్తమయం



త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: ప్రజల ఫిర్యాదులను పరిష్కరించే పోలీస్ స్టేషన్ కాస్తా చెత్తమయంగా మారింది. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎటు చూసినా చెత్తే దర్శనమిస్తోంది. స్టేషన్ ముఖద్వారాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతంలో కుప్పలుగా చెత్త పడి ఉంది. మరో వైపు వర్షం పడితే స్టేషన్ ప్రాంగణమంతా బురదమయంగా మారుతోంది. బుధవారం కురిసిన వాన ప్రభావంతో గురువారం నాటికి కూడా స్టేషన్ ప్రాంగణంలోని బురద పోలేదు. ఒక వైపు చెత్త.. మరో వైపు బురదతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ అధ్వానంగా కనిపిస్తోంది.



బురదమయంగా స్టేషన్ ప్రాంగణం

బాలల వికాసానికి కళలు దోహదం



వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులతో హరి రామమూర్తి తదితరులు

ఏయూక్యాంపస్: బాలల వికాసానికి, జ్ఞాపకశక్తి పెరగడానికి భారతీయ సాంస్కృతిక కళలు దోహదపడతాయని కూచిపూడి కళాకారుడు, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరి రామమూర్తి అన్నారు. బీచ్ రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో గురువారం బాలల విజ్ఞాన వికాస శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. లలిత కళలపై చిన్నారులకు తర్ఫీదునిస్తే అనేక సమస్యలకు పరిష్కారాలను చూపడం సాధ్యపడుతుందన్నారు. విద్యతోపాటు క్రీడలు, కళలను భాగం చేయడం ఎంతో అవసరమన్నారు. వెయ్యేళ్ల కూచిపూడి వారసత్వాన్ని బాలలకు అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.మధురవాణి మాట్లాడుతూ బాలల బహుముఖ వికాసానికి మార్గం చూపే విధంగా వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 31 వరకు శిబిరం కొనసాగుతుందని, లలిత కళలు, నృత్యం, చిత్రలేఖనం, భగవద్గీత, భాగవతం, విష్ణు సహస్రనామ పఠనం, నీతి కథలు వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. శిబిరాన్ని జీవీపీ సంస్థ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు, ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, సంయుక్త కార్యదర్శి డి.వి.ఎస్.కామేశ్వరరావు, ఆచార్య పి.రాజగణపతి తదితరులు సందర్శించి చిన్నారులను అభినందించారు.

ఈదురు గాలులకు చిరిగిన హోర్డింగ్ బ్యానర్లు



బీచ్ రోడ్డులో గాలికి చిరిగి వేలాడుతున్న హోర్డింగ్ బ్యానర్

ఏయూక్యాంపస్: నగరంలో ఈదురు గాలులతో కురిసిన వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లకు ఏర్పాటు చేసిన భారీ బ్యానర్లు చిరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇవి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌కు చేరువలో ఉన్న భారీ హోర్డింగ్ బ్యానర్ చిరిగిపోయి కిందకు వేలాడుతోంది. వాహన చోదకులకు, కార్లకు ఇది తగిలేలా ఉండటంతో జీవీఎంసీ సిబ్బంది వెంటనే స్పందించారు. వేలాడుతున్న ప్లాస్టిక్ బ్యానర్లను అతికష్టం మీద తొలగించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ఎటువంటి ప్రమాదం జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్ పక్కనే ఉన్న భారీ హోర్డింగ్‌కు సంబంధించిన బ్యానర్లు సైతం గాలికి చిరిగిపోయి వేలాడుతున్నాయి. వీటిని నిర్వాహకులు తొలగించాల్సిన అవసరముంది.

కులగణనకు కేంద్రం అంగీకారంపై హర్షం



ప్రధాని మోదీ, శంకర్‌రావుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సంఘ నాయకులు

ఎంవీపీకాలనీ: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలపడంపై జిల్లా బీసీ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఎంవీపీ కాలనీలోని సంఘ కార్యాలయం ఎదుట గురువారం బీసీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘ ఉత్తరాంధ్ర ఉద్యోగుల అధ్యక్షుడు ఇళ్ల వెంకటేశ్వరరావు, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు మాట్లాడుతూ కులగణన చేపట్టాలనే నినాదంతో రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు కొంతకాలంగా చేస్తున్న నిరసనకు ఫలితం లభించిందన్నారు. ఉత్పత్తి, గ్రామిక కులాలుగా ఉన్న ఎన్నో కులాలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు, సంక్షేమం లభించడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే కచ్చితంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని శంకరరావు నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తోందన్నారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు కులగణనతో పెద్ద ఎత్తున లబ్ధి జరుగుతుందని చెప్పారు. త్వరితగతిన కులగణన పూర్తిచేసి బీసీల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. సంఘం గ్రేటర్ విశాఖ అధ్యక్షుడు సుభాష్, జిల్లా అధ్యక్షుడు రమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శివాజీ పార్కు రోడ్డులో చెత్త కుప్పలు



శివాజీ పార్కు మెయిన్ రోడ్డులో చెల్లాచెదురుగా చెత్త కుప్ప

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డులో ఇసుకతోట జాతీయ రహదారి నుంచి శివాజీ పార్కుకు వెళ్లే మెయిన్ రోడ్డుపై చెత్తకుప్పలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. తాండ్ర పాపారాయ కల్యాణ మండపం జంక్షన్ పక్కన ఉన్న డంపర్ బిన్ వ్యర్థాలతో నిండిపోవడంతో చెత్త రోడ్డుపైకి విస్తరించింది. వీటిపై పశువులు, కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. వ్యర్థాలు రోడ్డపైకి చేరడంతో వాహనాలు వాటిపై నుంచి రాకపోకలు సాగించడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. చెత్త కుప్పల నుంచి వెలువడుతున్న దుర్వాసన పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. రెండు రోజులుగా చెత్త తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ శానిటరీ సిబ్బంది స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు.

కార్మికుల హక్కులు కాపాడుకోవాలి

మేడే వేడుకల్లో నాయకుల పిలుపు



జూ కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న సీపీఎం నేత కుమార్

ఆరిలోవ: కార్మికుల హక్కులను కలిసికట్టుగా కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలో సీపీఎం, సీపీఐ నాయకులు కార్మికులతో కలసి ఎర్ర జెండాలు ఆవిష్కరించారు. ఇందిరాగాంధీ జూ పార్కు వద్ద జూ కార్మికులతో కలిసి ఆర్.కె.ఎస్.వి.కుమార్ ఎర్ర జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల రక్షణ కోసం పోరాడాలన్నారు. జూలో పనిచేస్తున్న కార్మికులందరికీ రూ.26 వేలకు తక్కువ కాకుండా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలో పనిచేస్తూ కార్మికుడికి ప్రమాదం జరిగితే జూ యాజమాన్యం, ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో జూ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు పైడిరాజు, నరేష్, నర్సింగరావు, దిలీప్, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

- ఆరిలోవ సీఐటీయూ కార్యాలయం ముందు సీపీఎం నాయకులు ఎర్ర జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. నాయకులు నరేంద్ర కుమార్, శంకరరావు, సూర్యమణి, రంగమ్మ, గౌరి, రమణ, లక్ష్మీనారాయణ, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.
- ఆరిలోవలో పలుచోట్ల సీపీఐ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా నాయకుడు ఎస్.కె.రెహమాన్ మాట్లాడుతూ కార్మికులకు పనికి తగిన వేతానాలు చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. సీపీఐ నాయకులు దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు, పుష్పలత, చిరంజీవి, రవి, నారాయణ, రమణ, రాజు పాల్గొన్నారు.



ఆరిలోవ సీపీఎం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మిక వర్గంపై దాడిని తిప్పికొడదాం

మద్దిలపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని మేడే స్ఫూర్తితో తిప్పికొట్టాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. మేడే సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. సీపీఎం జోన్ కమిటీ సభ్యురాలు కె.కుమారి జెండా విష్కరణ చేశారు. నాయకులు ఎం.చంటి, జి.వి.ఎస్.చలపతి, జి.వి.రమణ, ఎం.ఆర్.డి.రాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేడే పతాకావిష్కరణలు

14 నుంచి 24వ వార్డు మున్సిపల్ కార్యాలయాల వద్ద, మద్దిలపాలెం ప్రాంతం, శివాజీ పార్కు, ముఠా, ఆటో, బిల్డింగ్, హాస్పిటల్స్, తోపుడుబండ్ల సెంటర్లలో సుమారు 45 చోట్ల మేడే పతాకావిష్కరణలు జరిగాయి. నాయకులు పి.వెంకటరావు, కె.కుమారి, పోలారావు, ఆర్.శ్రీను, దండు నాగేశ్వరరావు, ఎం.చంటి, రఘు, రమణ తదితరులు పాల్గొన్నారు.

- 15వ వార్డు హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్టాప్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్.మధు రెడ్డి, రావి అశోక్, దువ్వి బాలు, పిన్నింటి కృష్ణనాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సర్కిల్‌లో స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పడాల రమణ, టీడీపీ నాయకుడు గొలగాని పోలారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఎర్ర జెండాను ఆవిష్కరించి మజ్జిగ పంపిణీ చేశారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.



ఆరిలోవలో మేడే వేడుకల్లో సీపీఐ నాయకులు



సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యాలయంలో మేడే వేడుకలు



హెచ్‌బీ కాలనీలో జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ఎంవీపీ కాలనీలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఇంటి నుంచి వీధిలోకి పింఛన్ల పంపిణీ



ఆరిలోవ కాలనీలో పింఛన్ కోసం లబ్ధిదారులందరినీ వీధిలోకి రప్పించిన సచివాలయం సిబ్బంది

ఆరిలోవ: పింఛన్ల పంపిణీ ఇంటి నుంచి వీధిలోకి వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందించేవారు. దీంతో తెల్లవారే సరికే ఇంటి వద్దే లబ్ధిదారులు డబ్బులు అందుకొనేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ పద్ధతికి తూట్లు పొడిచింది. పూర్తిగా వలంటీర్లను తప్పించి పింఛన్ సొమ్ము అందించే బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించింది. దీంతోపాటు ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందించకుండా అందర్నీ ఒకే చోటకు పలిపించి పెన్షన్ అందిస్తున్నారు. సచివాలయం సిబ్బంది ఒకటో తారీఖున వీధిలో ఉన్న వారందర్నీ ఒకచోటకు పిలిచి అందిస్తున్నారు. గురువారం ఆరిలోవలో అన్ని చోట్ల వీధిల్లో పింఛన్ల కోసం లబ్ధిదారులు గంటల కొలది ఎదురుచూశారు. సచివాలయం సిబ్బంది వీధులు ప్రకారం వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. కొన్ని వీధుల్లో ఉదయం 10 నుంచి 11 గంటలు దాటినంత వరకు పింఛన్లు అందించారు. అంతవరకు వృద్ధులు పింఛన్ కోసం ఎదురుచూడక తప్పలేదు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు, ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పాల్గొన్నారు.